అంతా మా ఇష్టం..

కేఎంసీ డ్రాయింగ్ బ్రాంచిలో చక్రం తిప్పుతున్న ఆ ఇద్దరు

- కీలక విభాగంలో వారిదే పెత్తనం
- ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కావడంతో ఇష్టారీతిన వ్యవహరిస్తున్న వైనం
- పట్టించుకోని ఉన్నతాధికారులు



ఖమ్మం మున్సిపల్ కార్యాలయం

ఖమ్మంమయూరిసెంటర్: కోట్లాది రూపాయల పనులకు సంబంధించిన వ్యవహారాలన్నీ కేఎంసీలోని కీలక విభాగమైన డ్రాయింగ్‌బ్రాంచి నుంచే నడుస్తుంటాయి. టెండర్ల ప్రక్రియ నుంచి పనులు పూర్తయిన తర్వాత బిల్లుల పాస్ ఆర్డర్ ఇచ్చే వరకు ఈ విభాగంలోని అధికారులదే పూర్తి బాధ్యత. అయితే ఈ విభాగంలో పాతుకుపోయిన కొంతమంది సిబ్బంది చక్రం తిప్పుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. బిల్లులకు సంబంధించిన పాస్ ఆర్డర్లు ఇవ్వాలన్నా.. సకాలంలో బిల్లులు ముందుకు నడవాలన్నా.. పైసలు ముట్టచెబితేనే పని అవుతుందంటూ బాహాటంగానే కాంట్రాక్టర్లను అడుగుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఉన్నతాధికారుల పేర్లు చెప్పి మరీ వసూళ్లపర్వానికి తెరలేపినట్లు తెలుస్తోంది. ప్రతీ బిల్లుకు ఒక శాతం వరకు వసూలు చేస్తున్నారనేది ప్రచారం. డ్రాయింగ్ బ్రాంచి విభాగంపై ఇన్ని ఆరోపణలు వస్తున్నా ఉన్నతాధికారులు మాత్రం పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని కేఎంసీలో చర్చించుకుంటున్నారు.

డ్రాయింగ్ బ్రాంచి కీలకం..

కేఎంసీ పరిధిలో నిర్వహిస్తున్న అనేక అభివృద్ధి కార్యక్రమాల్లో డ్రాయింగ్ బ్రాంచిది కీలకపాత్ర. చేసిన పనులను లెక్కకట్టడం, టెండర్ ప్రకారం పనులు జరిగాయా..? లేదా అనేది సరిచూడటం అధికారులు చేస్తుంటారు. క్షేత్రస్థాయిలో ఉన్న వర్క్ ఇన్‌స్పెక్టర్లు జరిగిన పనికి సంబంధించిన ఎంబీలను డీబీ విభాగానికి అప్పగిస్తే.. వాటిలో లెక్కలను మాత్రమే చూసి ఎలాంటి సవరణలు చేయకుండా పాస్ ఆర్డర్ ఇవ్వడమా..? లేదా వెనక్కు పంపడమా.. అనేది అధికారుల బాధ్యత. ఈ విభాగంలో హెడ్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్‌గా డీఈ, టెక్నికల్ ఆఫీసర్‌గా ఏఈ, ఆ అధికారి కింద జూనియర్ టెక్నికల్ ఆఫీసర్లు విధులు నిర్వహించాల్సి ఉంది. అయితే లెక్కలను మాత్రమే చూసి ఏఈ, డీఈలకు బిల్లులకు సంబంధించిన ఫైల్స్‌ను జేటీఓలు అప్పగించాలి.

అంతా వారిదే..

కీలక శాఖ అయిన డీబీలో జేటీవోలుగా ఔట్‌సోర్సింగ్ సిబ్బంది అయిన వర్క్ ఇన్‌స్పెక్టర్లు విధులు నిర్వహిస్తున్నారు. వీరు క్షేత్రస్థాయిలో ఉండి విధులు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే గతంలో సిబ్బంది కొరతతో ఒకరిద్దరు ఔట్ సోర్సింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్‌లను డీబీలోకి తీసుకోగా.. వారు ఇక్కడ తిష్ట వేసి అంతకు ముందు అక్కడ పని చేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులను అక్కడి నుంచి వెళ్లిపోయేలా చేశారని, ఇటీవల కారుణ్య నియామకాల్లో ఇంజనీరింగ్ చదివిన వారిని రెగ్యులర్‌గా విభాగంలో నియమించినప్పటికీ వారిని సైతం భయపెట్టి వేరే విభాగాలకు వెళ్లేలా చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఏళ్ల తరబడి అక్కడ తిష్టవేసిన వారు కాంట్రాక్టర్లను ప్రభావితం చేస్తూ బిల్లుల పాస్ ఆర్డర్ ఇవ్వడానికి కమీషన్లు కోరుతున్నట్లు ఆరోపణలున్నాయి. అడిగిన సొమ్ము ముట్టచెప్పిన వారికి రెండు గంటల్లోనే బిల్లుల పాస్ ఆర్డర్లు ఇస్తున్న వీరు.. సొమ్ము ఇవ్వని వారికి కొర్రీలు పెట్టి కార్యాలయం చుట్టూ తిప్పుతున్నట్లు తెలుస్తోంది. ఇక ఉన్నతాధికారుల పేర్లు చెప్పి వీరు డబ్బులు వసూలు చేస్తున్నట్లు కూడా ఒకరిద్దరు కాంట్రాక్టర్లు పేర్కొనడం గమనార్హం.

విచారణ చేస్తాం..



డ్రాయింగ్ బ్రాంచిలో సిబ్బందిపై వస్తున్న ఆరోపణలపై విచారణ చేయిస్తాం. ఈ విషయం నా దృష్టికి రాలేదు. డీఈ, ఏఈలదే డ్రాయింగ్ బ్రాంచిలో కీలక బాధ్యత. బిల్లులకు సంబంధించి ఎలాంటి నిర్ణయమైనా వారు తీసుకోవాల్సిందే. ఆరోపణలు నిజమని తేలితే చర్యలు తీసుకుంటాం.

– ఆదర్శ్ సురభి, కమిషనర్

క్లుప్తంగా

రెండో రోజు ఐదు పతకాలు


పతకాలు సాధించిన చిన్నారులు

ఖమ్మం స్పోర్ట్స్: నిజామాబాద్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఉషూ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు రెండో రోజైన సోమవారం ఐదు పతకాలు సాధించారు. టి.సాయి భవ్యశ్రీ బంగారు పతకం గెలుచుకోగా, ఎస్.కే.సస్‌కొసర్, జె.ప్రహర్షన్‌పాల్‌కు రజత పతకాలు, బి.జావేద్, కె.దేవామనికంఠకు కాంస్య పతకాలు దక్కాయి. ఈ సందర్భంగా క్రీడాకారులను డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డి, ఉషూ సంఘం కార్యదర్శి పి.పరిపూర్ణాచారి అభినందించారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐ రవికుమార్

ఖమ్మంక్రైం: ఖమ్మం టూటౌన్ సీఐగా రవికుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు సీఐ శ్రీధర్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మర్యాదపూర్వకంగా నగర ఏసీపీ గణేష్‌ను కలిశారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

జేవీవీ జిల్లా మాజీ అధ్యక్షుడికి పరామర్శ

ఖమ్మంమయూరిసెంటర్: జన విజ్ఞాన వేదిక మాజీ జిల్లా అధ్యక్షుడు, రిటైర్డ్ లెక్చరర్ తాత రాఘవయ్య సతీమణి తాత ఝాన్సీ(65) సోమవారం ఉదయం మృతి చెందారు. ఈసందర్భంగా ఖమ్మంలోని వారి స్వగృహంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావుతోపాటు వై.శ్రీనివాసరావు, శివన్నారాయణ, బాబురావు, గోవిందరావు, గోపీచంద్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తాగు, సాగునీరు అందించాలి

కూసుమంచి: పాలేరు రిజర్వాయర్‌ను వెంటనే నింపి తాగు, సాగునీరు అందించాలని టీపీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన అడుగంటిన రిజర్వాయర్‌ను పరిశీలించారు. రిజర్వాయర్‌లో నీటిమట్టం పడిపోవటంతో అధికారులు 74 గ్రామాలకు తాగునీరు అందించలేమని ప్రకటన చేయటం ప్రభుత్వ వైఫల్యమేన్నారు. తాగునీరు అందకపోతే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇలాంటి పరిస్థితి ఎన్నడూ లేదన్నారు. తాగునీటిని అందించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. నాయకులు ఎడవెల్లి రాంరెడ్డి, నాగిరెడ్డి రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ట్రాక్టర్, కారు ఢీ..

రఘునాథపాలెం: ట్రాక్టర్, కారు ఢీకొనగా నలుగురికి గాయాలైన ఘటన మండలంలోని బూడిదంపాడు వద్ద సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జలవనరుల శాఖ ఉద్యోగి కత్తి విజయ్‌కుమార్ తన కారులో భార్య సంధ్య, కుమార్తె తన్మయి, కుమారుడు సత్యలతో కలిసి ఖమ్మం నుంచి ఇల్లెందు వెళ్తుండగా ఖమ్మం వైపు వస్తున్న బూడిదంపాడు గ్రామానికి ట్రాక్టర్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న నలుగురికి గాయాలు కావడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నగరంలో సినిమాలు

తిరుమల	రంగబలి
వినోద	స్పై
సాయిరాం	సామజవరగమన
ఆదిత్య	రుద్రంగి
శ్రీనివాస	భాగ్‌సాలే
సుందర్	గ్యాంగ్‌లీడర్, సర్కిల్

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	106	బచ్చలికూర	2
వంకాయ	36		10
బెండకాయ	46	పాలకూర	3
పచ్చిమిర్చి	100		10
కాకర	80	చుక్కకూర	2
బీర	40		10
సొరకాయ	20	తోటకూర	2
దొండ	29		10
పొట్లకాయ	40	గోంగూర	2
చిక్కుడు	68		10
గోరుచిక్కుడు	40	మెంతికూర	5
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	50	కొత్తిమీర	1
ఆలుగడ్డ	26		15
చామగడ్డ	46	పుదీన	1
క్యారెట్	56		15
క్యాప్సికం	76	-ఖమ్మం వ్యవసాయం	

హామీల అమలులో విఫలం


ధర్నా చేస్తున్న నాయకులు

నేలకొండపల్లి: రైతుల హామీలు చేయడంలో సీఎం కేసీఆర్ విఫలమయ్యారని, రైతుల సమస్యలు పరిష్కరించకుంటే ఆగ్రహానికి గురికాక తప్పదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్ హెచ్చరించారు. మండలం కేంద్రంలోని పార్టీ కార్యాలయం నుంచి తహసీల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహసీల్దార్ దారా ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం విక్రయించిన రైతులకు నేటి వరకు బిల్లులు ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని అన్నారు. డోర్నకల్–మిర్యాలగూడెం రైల్వేలైన్‌ను వెంటనే మార్చాలని డిమాండ్ చేశారు. మధుకాన్ చెరుకు రైతుల బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విక్రమ్, రచ్చా నరసింహారావు, కె.వీ.రెడ్డి, గుడవర్తి నాగేశ్వరరావు, ఏటుకూరి రామారావు, భూక్యా కృష్ణ, దుగ్గి వెంకటేశ్వర్లు, మందడపు మురళీ, సిరికొండ ఉమామహేశ్వరీ, బెల్లం లక్ష్మి, కొండలరావు, భాస్కర్, కూరపాటి ప్రసాద్, అనంతు భాగ్యమ్మ, పద్మ, అనంతు రవి, తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ వినియోగదారుల సదస్సు

నేలకొండపల్లి/కూసుమంచి: నేలకొండపల్లిలోని రైతువేదికలో బుధవారం తెలంగాణా రాష్ట్ర విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక వరంగల్ ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల సదస్సును నిర్వహిస్తున్నట్లు కూసుమంచి ట్రాన్‌కో ఏడీఈ కోక్యానాయక్, నేలకొండపల్లి ఏఈ కె.రామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. లో వోల్టేజీ, హెచ్చుతగ్గులు, విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌లు, క్రమబద్ధీకరణ, నూతన సర్వీస్‌లు, పేరు మార్పు తదితర సమస్యలపై ఫిర్యాదులు చేయవచ్చని పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు ఫిర్యాదులు స్వీకరిస్తామని, వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

'హార్వెస్ట్' విద్యార్థి ప్రతిభ


మోహన్‌సాయిని అభినందిస్తున్న కరస్పాండెంట్, ప్రిన్సిపాల్

ఖమ్మం సహకారనగర్: బెంగళూరులోని ప్రతిష్టాత్మక ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్‌లో తమ విద్యార్థి దారపు మోహన్‌సాయి సీటు సాధించాడని హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మోహన్‌ను అభినందించిన వారు మాట్లాడుతూ దేశంలోనే అత్యంత కష్టతరమైన పోటీ పరీక్షలో ప్రతిభ కనబర్చి సీటు సాధించాడని పేర్కొన్నారు.

అల్లీపురంలో యువకుడు మృతి

ఖమ్మం అర్బన్: గుండెపోటుతో కేఎంసీ పరిధిలోని అల్లీపురానికి చెందిన ఓ యువకుడు మృతి చెందాడు. అల్లీపురానికి చెందిన గరికపాటి నాగరాజు పెయింటింగ్ పనులు చేస్తుండగా ఆదివారం మధ్యాహ్నం కుటుంబీకులతో భోజనం చేసేందుకు కూర్చున్నాడు. ఇంతలోనే అస్వస్థతకు గురైన ఆయనను ఆటోలో ఖమ్మం తీసుకెళ్తుండగా మార్గమధ్యలో ఎదురైన 108 సిబ్బంది పరీక్షించి నాగరాజు మృతి చెందినట్లు ధృవీకరించారు. గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలతో నాగరాజు చనిపోయినట్లుగా భావిస్తుండగా, ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నేడు మంత్రి పువ్వాడ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మంగళవారం ఖమ్మంలో పర్యటించనున్నారు. నగరంలోని 14, 20, 21, 33, 40వ డివిజన్లలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడమే కాక పూర్తయిన పనులను ప్రారంభిస్తారు. అలాగే, సాయంత్రం 5 గంటలకు క్యాంపు కార్యాలయంలో యువతకు లెర్నింగ్ లైసెన్సు పత్రాలను మంత్రి పంపిణీ చేయనున్నారు.

కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మె

సమస్యలు పరిష్కరించాలని గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె కొనసాగుతోంది. సోమవారం పలు పార్టీలు, సంఘాల నాయకులు సమ్మెకు మద్దతు తెలిపారు. కారేపల్లిలో వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


కారేపల్లిలో వంటావార్పు...


రఘునాథపాలెంలో..


ఖమ్మం రూరల్: మద్దతు తెలుపుతున్న నాయకులు

నేత్రదానం

ఖమ్మంవైద్యవిభాగం: పలు కారణాలతో మృతిచెందిన వ్యక్తుల నేత్రాలను వారి కుటుంబ సభ్యులు దానం చేశారు. ఈ మేరకు కాల్వొడ్డుకు చెందిన పద్మావతి, దంసలాపురానికి చెందిన నాగునూరి విజయలక్ష్మి, న్యూకాలనీకి చెందిన కాంతాల శ్రీను, జలగం నగర్‌కు చెందిన కొమ్ము శంకర్, నగరానికి చెందిన వ్యాకరణం రామశాస్త్రి, మోతినగర్‌కు చెందిన రేపల్లి రవి, రిక్కాబజార్‌కు చెందిన గన్నారపు వెంకట నరసింహారావు, కమాన్‌బజార్‌కు చెందిన వంగవీటి కృష్ణమూర్తి మృతిచెందగా వారి నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. సేకరించిన నేత్రాలను హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ ఐబ్యాంక్, అపోలో, వాసన్, అగర్వాల్ ఐబ్యాంక్‌లకు తరలించనున్నట్లు ఖమ్మం నేత్రనిధి కార్యదర్శి ఆర్.ఏ.పద్మనాభం తెలిపారు. నేత్రదానం చేయదలచిన వారు 9397191919 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తిరుమలాయపాలెం: మండలంలోని తిరుమలాయపాలెం సెక్షన్ పరిధిలోని పిండిప్రోలు సబ్‌స్టేషన్ పరిధిలోని తెట్టెలపాడు, తాళ్లచెరువు, గోపాలపురం, తిమ్మక్కపేట జల్లెపల్లి ఫీడర్ పరిధిలోని జల్లెపల్లి, జోగులపాడు గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరాలకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఎ.ఈ రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల పరిధిలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల వల్ల ఉదయం 7.30 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు, రైతులు సహకరించాలని పేర్కొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మంమయూరిసెంటర్: గ్రామ పంచాయతీ, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పంచాయతీ వర్కర్లు తమను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనాన్ని అమలు చేయాలని ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించక పోవడం అత్యంత బాధాకరమని, మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు ప్రభుత్వం కోట్లాది రూపాయల బకాయి పడిందని, ఆ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని పేర్కొన్నారు. కార్మిక వర్గ ఆందోళనకు పార్టీ పూర్తి మద్దతును తెలియజేస్తుందని తెలిపారు.

నూతన పీఆర్‌సీ ఏర్పాటుచేయాలి

నేలకొండపల్లి: రాష్ట్ర అవతరణ తర్వాత మెదటి పీఆర్‌సీ గడువు జూన్‌తో ముగిసినందున వెంటనే కొత్త పీఆర్‌సీ ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో మరో ఉద్యమం తప్పదని టీపీటీఎఫ్ శాఖ జిల్లా బాధ్యులు టి.వెంగళరావు అన్నారు. మండలకేంద్రలో మండలశాఖ ఆధ్వర్యంలో సోమవారం శాఖ సబ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యాశాఖలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. సంఘం జిల్లా కన్వీనర్ పెద్ది జగన్నాథం, హనుమంతరావు, మండల ప్రధాన కార్యదర్శి రవికిషోర్, బీ.రామారావు, చీనా పాల్గొన్నారు.

నాటిన ప్రతీ మొక్కను రక్షించాలి


మొక్క నాటి నీళ్లు పోస్తున్న మేయర్ పునుకొల్లు నీరజ తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: నాటిన ప్రతి మొక్కను రక్షించుకోవాలని మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. నగరంలోని ఎస్ఎస్‌పీ క్యాంపులోని పట్టణ ప్రకృతి వనంలో సోమవారం హరితహారం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి హరితహారం కార్యక్రమ లక్ష్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌లు పగడాల శ్రీవిద్య నాగరాజు, బుర్రి వెంకట్, రాపర్తి శరత్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, రోటరీక్లబ్ అధ్యక్షులు కోటీరు వెంకటరెడ్డి, ముత్తయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతుబీమా నమోదు పకడ్బందీగా చేపట్టాలి


మాట్లాడుతున్న ఏడీఏ విజయచంద్ర

కూసుమంచి: కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన 18 నుంచి 59 సంవత్సరాల లోపు రైతులకు రైతుబీమా పొందేందుకు దరఖాస్తులు స్వీకరించాలని, ఆ నమోదును పకడ్బందీగా చేపట్టాలని కూసుమంచి ఏడీఏ విజయచంద్ర కోరారు. సోమవారం కూసుమంచిలోని రైతు వేదికలో మండల వ్యవసాయాధికారులు, ఏఈఓలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుబీమాకు దరఖాస్తు చేసుకునే రైతులు వారి క్లస్టర్ పరిధిలోని ఏఈఓలకు దరఖాస్తులను అందజేయాలని సూచించారు. అర్హత ఉన్న ఏ ఒక్క రైతు కూడా ఈ పథకం ప్రయోజనం కోల్పోకుండా చూడాలన్నారు. ఏఈఓలు ప్రతీ మంగళ, శుక్రవారాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించాలని, దీన్ని ఏఓలు పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఓలు వాణి, సీతారాంరెడ్డి, నాగేశ్వరరావు, ఏఈఓలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమిస్తాం


ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమిస్తామని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి వి.వెంకటేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టి.ప్రవీణ్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మస్తాన్‌లు అన్నారు. బుధవారం తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం నగరంలోని బస్ డిపో నుంచి పాత బస్టాండ్ వరకు వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు లేవని, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మన ఊరు–మన బడిలో నామమాత్రంగానే పనులు పూర్తి చేశారన్నారు. పాఠశాలల్లో స్వచ్ఛ కార్మికులను నియమించాలన్నారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలకు ఫీజులు పెంచుకోమని విచ్చలవిడిగా పర్మిషన్లు ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘాల నేతలు లక్ష్మణ, కరుణ్, శివ, రాకేష్, చందూలాల్ తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచి: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సమాయ కార్యదర్శి సుధాకర్, పీడీఎస్‌యూ కార్యదర్శి సతీష్, ఏఐఎస్ఎఫ్ పాలేరు డివిజన్ కార్యదర్శి శివ కోరారు. మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


చిన్నారులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు, సంస్థ సభ్యులు

ఖమ్మంవైద్యవిభాగం: వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, తలసేమియా చిన్నారులను తల్లిదండ్రులు జాగ్రత్తగా చూసుకోవాలని వైద్యులు డి.నారాయణమూర్తి, సంస్థ కోశాధికారి పి.రవిచందర్‌లు అన్నారు. సోమవారం సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులకు ఉచిత మందులు పంపిణీ చేసి, తలసేమియా ప్యాక్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీజన్ మారిన నేపథ్యంలో పిల్లలు ఈ వాతావరణానికి అలవాటు పడే వరకు జాగ్రత్తగా ఉండాలన్నారు. తలసేమియా వైద్య పరీక్షలు ప్రతి నాలుగు నెలలకు ఒకసారి చేయించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షురాలు పి.పావని, పి.ఉదయ్‌భాస్కర్, అనిత తదితరులు పాల్గొన్నారు.

ప్లేట్లు, గ్లాసుల పంపిణీ


ఆర్థికసాయం అందజేస్తున్న కందాళ విజయమ్మ

ఖమ్మంరూరల్: నియోజకవర్గంలోని కైకొండాయిగూడెం, దానవాయిగూడెం, రామన్నపేట డివిజన్లలో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సోమవారం కందాళ ఫౌండేషన్ ద్వారా ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి సతీమణి విజయమ్మ పంపిణీ చేశారు. అదే విధంగా మండలంలోని పలు గ్రామాల్లో వివిధ కారణాలతో మృతి చెందిన పలు బాధిత కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.10వేలు చొప్పున మొత్తం రూ.1.50 లక్షలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బెల్లం వేణు, వెంకన్న, రామయ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సదస్సును జయప్రదం చేయాలి

తిరుమలాయపాలెం: దళితుల సమస్యల పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17న తిరుమలాయపాలెంలో నిర్వహించే మండల స్థాయి సదస్సుని జయప్రదం చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర నాయకులు పాపిట్ల సత్యనారాయణ అన్నారు. సోమవారం మండలంలోని దమ్మాయిగూడెం, మేడిదపల్లి, హస్నాబాద్ తదితర గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి పల్లి రమేష్ నాయకులు సురేష్, మెట్టు శ్రీను, ఇజ్రాయిల్, నర్సయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కమిటీల సిఫారసులు అమలు చేయకుండా మోసం

ఖమ్మంలీగల్: సచార్ కమిటీ, రంగనాథ్ కమిటీల సిఫారసులను అమలు చేయకుండా ముస్లింలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మేకల సుగుణారావు ఒక ప్రకటనలో సోమవారం ఎద్దేవ చేశారు. బీఆర్ఎస్ పార్టీ ముస్లింల కోసం అంకితభావంతో పనిచేస్తోందని తెలిపారు.

నిన్న సంబరాలు... నేడు విషాదం

- గుండెపోటుతో మార్కెట్ మాజీ చైర్మన్ కుమారుడు మృతి

ఖమ్మంఅర్బన్: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఖమ్మం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్ కుమారుడు శ్రీధర్(21) సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. నగరంలోని బాలపేటలోని ఇంట్లో ఉదయం నిద్రలేచిన శ్రీధర్ జిమ్‌కు వెళ్లి 7గంటలకు తిరిగి రాగా, గదిలోకి వెళ్లి ఒక్కసారి కుప్పకూలిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కాగా, శ్రీధర్ సోదరుడి కుమారుడు అన్నప్రాసన వేడుక ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన బంధువులు, కుటుంబీకులతో సందడిగా గడిపిన ఆయన మరుసటి రోజే కన్నుమూయడంతో విషాదం నెలకొంది.

పలువురి పరామర్శ..

మానుకొండ శ్రీధర్ మృతి చెందినట్లు తెలుసుకున్న పలువురు ప్రజాప్రతినిధులు ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించడంతో పాటు శ్రీధర్ తండ్రి రాధాకిషోర్, కుటుంబీకులను పరామర్శించారు. మండలంలోని బాలపేటలోని నివాసంలో ఆయన మృతదేహం వద్ద మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నివాళులర్పించారు.


శ్రీధర్ (ఫైల్)

అలాగే, ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే రాములునాయక్, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి, మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే చంద్రావతి కూడా సంతాపం ప్రకటించారు. ఇంకా నివాళులర్పించిన వారిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, వివిధ పార్టీల నాయకులు భాగం హేమంతరావు, పోటు ప్రసాద్, తమ్మినేని వీరభద్రం, పోతినేని సుదర్శన్ రావు, నున్నా నాగేశ్వరరావు, రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, ఫజల్, శ్యాంరాథోడ్, గుత్తా వెంకటేశ్వర్లు, నెల్లూరి కోటేశ్వరరావు, కార్తీక్, డీకొండ శ్యాం తదితరులు ఉన్నారు.